రైతు నిస్సహాయ కేంద్రాలు

- అలంకారప్రాయంగా ఆర్బీకేలు
- గత ప్రభుత్వ పాలనలో కేంద్రాల ద్వారానే రైతులకు సంక్షేమ పథకాలు
- నేడు అందని సంక్షేమ పథకాలు, అమలుకాని హామీలు



కాకుమానులో నిర్మించిన రైతుసేవా కేంద్రం

కాకుమాను: ఉన్న ఊరిలోనే రైతులకు సేవలందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా అందించే సంక్షేమం, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సాంకేతిక పరికరాలు తదితర పథకాలను అందించేందుకు గత ఐదేళ్ల పాటు రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంత వరకూ రైతుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోకపోగా ఆర్బీకేల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చి సేవలను నిలిపివేసింది. నిన్నటి వరకు అన్నదాతలకు ఎంతగానో ఉపయోగపడిన కార్యాలయాలు, యంత్రాలు నేడు నిరుపయోగంగా మారాయి.

వైఎస్సార్ సీపీ హయాంలో...

మండలంలో గత ఐదు సంవత్సరాలలో రైతు భరోసా కింద 48,429 మంది రైతులకు సుమారు 69 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసింది. 2024 ఆగస్టు నెలలో కురిసి భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన 2,166 మంది రైతులకు ఎన్నికల అనంతరం నాలుగు కోట్ల రూపాయలను ఖాతాల్లో జమచేసింది. వైఎస్సార్ యంత్ర పథకం ద్వారా 140 మంది రైతులకు సుమారు రూ.53 లక్షలను సబ్సిడీ కింద అందజేసి అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకుంది.

హామీలు పక్కన పెట్టిన ప్రభుత్వం...

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఏటా రైతులకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటించింది. ఈ ఏడాది ఖరీఫ్ ముగిసింది. మరో కొద్ది రోజుల్లో రబీ సీజన్ కూడా ముగుస్తుంది. అయినా ఆ పథకం అమలు ఊసే లేకుండా పోయింది. జగనన్న పాలనలో రైతు పంటనష్టపోతే వారికి పరిహారం అందించేందుకు ఉచిత పంటల బీమా వర్తింపజేసింది. అందుకుగాను ప్రీమియం భారాన్ని నాడు ప్రభుత్వమే భరించింది. నేడు మాత్రం బీమా బాధ్యతను రైతులపై మోపి భారం దించుకుంది. ఒక్కో పంటకు ఒక రేటు చొప్పున బీమా చేయించింది. రైతుసేవా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు అందే పరిస్థితి లేకుండా పోయింది.

నాడు యంత్రాలు.. యంత్ర సాయం

గత ఐదేళ్ల పాటు ఆర్బీకేల ద్వారా రైతులకు యంత్ర సాయం అందజేసింది. గ్రూపుగా ఏర్పడిన రైతులకు యంత్ర పరికరాలను అందజేసి వ్యవసాయానికి వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టింది.యంత్రాలను కూడా ప్రభుత్వం సబ్సిడీపై అందజేసింది. దీంతో ఆధునిక యంత్రాలతో సేద్యం సులువుగా చేయగలిగి మంచి దిగుబడులు సాధించారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇక అర్హులైన రైతులకు వివిధ యంత్రాలు, ట్రాక్టర్లు అందజేసింది. అలాగే సాంకేతిక సాయం అందుబాటులో ఉండేందుకు కియోస్క్‌ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ముందస్తుగా బుక్ చేసుకునేందుకు అవకాశం ఉండేది. అలాగే ఆధునిక సాంకేతిక వినియోగం, మార్కెట్‌లో దిగుబడుల ధరలు సమీప మార్కెట్‌లో ఉండే ధరల వివరాలను, వాతావరణ వివరాలను తెలుసుకునే అవకాశం కల్పించి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంది.

ఎరువుల కొరత



గత ప్రభుత్వ హయాంలో రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేదు. ఏ సీజన్‌లో ఆ సీజన్‌కు కావల్సిన ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులందరికి సకాలంలో అందజేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఎరువులు, విత్తనాలు కావాలన్నా ప్రైవేట్ షాపులకు వెళ్లాల్సిన వస్తుంది.

–నల్లమోతు శివరామకృష్ణ, రైతు

రైతులకు మేలు చేసేందుకే ..



ఏ ఒక్క రైతు ఎరువులు, విత్తనాల కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలను లక్షల వ్యయంతో నిర్మించింది. నేడు అలాంటి కేంద్రాలు నిర్వీర్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీని వలన మండలంలోని రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కోసం రైతులు పట్టణాలకు పరుగులు తీయవల్సి వస్తుంది.

–మెరిగల సుందరరావు

వైఎస్ జగన్‌ను కలిసిన అంబటి మురళీకృష్ణ



పొన్నూరు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో వైఎస్ జగన్‌ను కలిశారు.

క్లుప్తంగా

రీ సర్వే పూర్తి చేయాలి

పొన్నూరు: మండలంలోని వల్లభరావుపాలెంలో చేపడుతున్న వ్యవసాయ భూముల 'రీ సర్వే' త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. బుధవారం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే, సంబంధిత రికార్డులను పరిశీలించారు.

పాఠశాల తనిఖీ

పెద్దివారిపాలెం(కాకుమాను): విద్యార్థులలో పఠనా నైపుణ్యాలను పెంపొందించే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని పెద్దివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న పఠనా నైపుణ్యాలను పెంపొందించి ప్రతి విద్యార్థి ఏ.ఏ ప్లస్ గ్రేడులో ఉండే విధంగా కృషి చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి రుచి చూశారు.

కేంద్ర బడ్జెట్‌లో రైతులకు అన్యాయం



కాకుమాను: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయనికి అన్యాయం జరిగిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొత్త వెంకట శివరావు అన్నారు. పెదనందిపాడు ప్రధాన కూడలిలో బుధవారం కేంద్ర బడ్జెట్‌పై రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ ఎరువులపై సబ్సిడీ తగ్గించారని, ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపులు తగ్గించడం అన్యాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ మండల అధ్యక్షుడు ముద్దన వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పోపూరి సుధీర్, కన్నెగంటి చంద్రారావు, గద్దె మల్లేశ్వరరావు, పి.భువనేశ్వరి, పి.సలీం, మర్రి లక్ష్మి, టి.గాబ్రియేల్ పాల్గొన్నారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య



పెదకాకాని: మండలంలోని నంబూరుకు చెందిన వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామంలోని విజయభాస్కర్‌నగర్‌కు చెందిన నంబూరు హనుమయ్యకు రెండేళ్ల కిందట ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన అక్షయతో వివాహం జరిగింది. వారికి సంతానం లేదు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అక్షయ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు అక్షయ(23)ను చికిత్స నిమిత్తం తరలించే క్రమంలో మృతి చెందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పెదకాకాని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్యాన్సర్‌పై అవగాహన

గుంటూరు రూరల్: క్యాన్సర్ మహమ్మారిని అంతమొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషిచేయాలని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ టి.సంధ్య తెలిపారు. బుధవారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ, ఇకోక్లబ్ ఎన్ఎస్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్యాన్సర్ నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్ షారోన్‌రోజ్, పీడీ జి.బాలశౌరిరెడ్డి, ఐ.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంతో పురోగతి

గుంటూరు రూరల్: మంచి వ్యక్తిత్వం, మంచి మార్గదర్శకాలతో ముందుకు సాగుతూ ఉన్నత శిఖరాలను చేరాలంటే చదువు ఒక్కటే మార్గమని అందుకు ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచి కృషిచేయాలని యువజన సర్వీసులు శాఖ మేనేజర్ బి.రాధిక తెలిపారు. బుధవారం నల్లపాడు గ్రామంలోని బాసర కాన్సెప్ట్ స్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, డాక్టర్ నూతలపాటి అరవింద్, మానవతా సంఘం అధ్యక్షుడు శివరాంప్రసాద్, స్టెప్ సూపరింటెండెంట్ తన్నీరు శ్రీనివాసరావు, బాసర స్కూల్ చైర్మన్ మురళీ మోహన్‌రావు, డైరెక్టర్ సాధినేని రాధిక పాల్గొన్నారు.

ఫైర్ అండ్ సేఫ్టీ విభాగంలో ఉపాధి అవకాశాలు


అవగాహన ఒప్పందం పత్రాలతో వీసీ గంగాధరరావు, సంస్థ ప్రతినిధులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ(దూర విద్యా కేంద్రం), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫైర్ అండ్ సేఫ్టీ విశాఖపట్నం మధ్య విద్యా సంబంధ సహకారాన్ని పునరుద్ధరించడం, కొనసాగించడం కోసం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అగ్ని భద్రత, అత్యవసర ప్రతిస్పందన, సంబంధిత రంగాలలో విద్యను పెంపొందించడానికి భాగస్వామ్య నిబద్ధతతో, విద్యా, పరిశోధన, శిక్షణ కార్యకలాపాలలో సహకారాన్ని పెంపొందించడం కొరకు ఈ ఒప్పందం చేసుకోవటం జరిగింది. గత 25 సంవత్సరాలుగా నేషనల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో ఎన్ఐఎఫ్ఎస్ దేశమంతటా ఫైర్ అండ్ సేఫ్టీ కోర్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వీసీ కె.గంగాధర రావు, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫైర్ అండ్ సేఫ్టీ రంగంలో నిరుద్యోగ యువతీయువకులకు పారిశ్రామిక రంగంలో ఉత్తమమైన ఉద్యోగావకాశాలు పొందటానికి ఫైర్ అండ్ సేఫ్టీలో చేసిన కోర్సులు దోహదపడతాయన్నారు. ఈ రంగంలో ఉద్యోగాలు ఫైర్ మెన్, ఫైర్ ఆఫీసర్, ఫైర్ ఇంజినీర్, సేఫ్టీ ఆఫీసర్, సేఫ్టీ ఇంజినీర్, సేఫ్టీ ఆడిటర్ వంటి ఉద్యోగాలు పొందటానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు, పరీక్షల కో ఆర్డినేటర్ డి.రామచంద్రన్ హాజరయ్యారు.

విచక్షణా రహితంగా పురుగు మందులు వినియోగించొద్దు

హెచ్ఐఎల్ సంస్థ సీఎండీ కుల్‌దీప్ సింగ్



రైతులకు కిట్‌లను అందజేస్తున్న హెచ్ఐఎల్ సంస్థ సీఎండీ కుల్‌దీప్‌సింగ్

గుంటూరు రూరల్: వ్యవసాయంలో రైతులు విచక్షణ రహితంగా పురుగు మందులను వినియోగించవద్దని న్యూఢిల్లీకి చెందిన భారత ప్రభుత్వ హెచ్ఐఎల్ ఇండియా లిమిటెడ్ సంస్థ సీఎండీ కుల్‌దీప్‌సింగ్ తెలిపారు. బుధవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు పురుగు మందుల వినియోగం, సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కుల్‌దీప్ సింగ్ మాట్లాడుతూ రైతులు జరుగుతున్న అనర్థాలను అరికట్టేందుకు తమవంతుగా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని, రసాయన ఎరువులను వినియోగించే సమయంలో తగిన భద్రత చర్యలు పాటించాలని, ప్రత్యక్షంగా చూపించి తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు సేఫ్టీ కిట్‌లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఐఎల్ డీజీఎం అజిత్‌వర్మ, ఏ రమేష్ తేజ, ఎం.అమర్‌అలీ, కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్‌కుమార్, అగ్రానమీ శాస్త్రవేత్త డాక్టర్ గంగాదేవి, రాజకుమారి పాల్గొన్నారు.

కళ్లం కళాశాలను సందర్శించిన ఇసుజు ఎండీ


ఇంజిన్ కట్ సెక్షన్ మెషిన్‌ను అందజేస్తున్న ఇసూజు సంస్థ ప్రతినిధులు

గుంటూరు రూరల్: కళ్లం ఇంజినీరింగ్ కళాశాలను ఇసుజు మోటార్స్ ఇండియా కంపెనీ ప్రెసిడెంట్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్ సందర్శించి రూ.5 లక్షల విలువచేసే ఇంజిన్ కట్ సెక్షన్ మెషిన్‌ను కళాశాలకు బహూకరించారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ ఇసుజు మోటార్స్ ఇండియా కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) ఫండ్స్ ద్వారా తమ కళాశాలకు ఇంజిన్‌కట్‌సెక్షన్ మెషిన్‌ను అందజేశారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి మాట్లాడుతూ మా కళాశాలను ఇసుజు మోటార్స్ గుర్తించి కట్ మెషిన్‌ను డొనేషన్ చేయడమే కాకుండా డిప్లొమా, ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు భవిష్యత్తులో కళాశాలతో ఒప్పంద పత్రాలను అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరావు, ఉపాధికల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు పాల్గొన్నారు.

ముగిసిన రెండురోజుల సదస్సు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో ఫార్మా ఎనలిటికా ఎనలిటికల్ కాన్ఫరెన్స్ కార్యక్రమలో భాగంగా అనాకాన్ 2025, బియాండ్ ద బీకర్ గ్రీన్ టూల్స్ ఫర్ ద మోడరన్ ఎనలిస్ట్ అనే అంశంపై రెండురోజులుగా సదస్సు బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ల్యాబ్ ఇండియా అనలిటికల్ ఇన్స్ట్రుమెంట్స్ ప్రై లిమిటెడ్ ఎన్ఎంఆర్ ప్రొడక్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ శుబెందుపండిట్ మాట్లాడుతూ బెంచ్‌టాప్ ఎన్ఎంఆర్ అనేది చిన్న పరిమాణంలో ఉండి, టేబుల్ మీద కూడా పెట్టుకోవచ్చని, ఇది తక్కువ ఖర్చుతో, సులభంగా నిర్వహించగలిగేలా రూపొందించబడిందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ ఈ రెండు రోజుల అనకాన్ 2025 జాతీయ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా 08 కళాశాల నుండి 209 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అనాకాన్ – 2025లో చురుకుగా పాల్గొని విశ్లేషణాత్మక పరికరముల పనితీరును వివరించిన వాలంటీర్లకు గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అతిథి చేతుల మీదుగా నగదు బహుమతుల ప్రదానం చేశారు.

ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: రినెక్స్ టెక్నాలజీ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలలోని 23 మంది విద్యార్థులకు ఇంటర్న్ షిప్ ద్వారా రూ.25 వేల స్టైపెండ్‌తో పాటుగా, ప్రతిభ ఆధారంగా రూ.10 లక్షల వరకు ప్యాకేజీతో కూడిన ఉద్యోగాలు అందుకోవడం ఆనందకరంగా ఉందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. బుధవారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్స్ సిహెచ్.శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు అభినందించారు.

పెసరలో బూడిద తెగుళ్ల నివారణకు చర్యలు



పెదకాకాని: రైతులు పెసర పైరులో బూడిద తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలసి గ్రామ శివారులోని పెసర పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినుము, పెసర పంటల్లో పల్లాకు తెగుళ్లను గుర్తించి తెల్లదోమ నివారణకు, ఉధృతిని అంచనా వేసేందుకు పసుపురంగు అట్టలను పైరు మధ్యలో ఉంచాలన్నారు. ఎసెఫేట్, ప్రొఫెనోపాస్, థయోమిథాక్సామ్, డైమిథోయేట్ వంటి మందులు పల్లాకు తెగులు నివారణకు పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి, ఏఈఓ ఆర్‌వీ శివాజీ, ఎస్‌వీ శివరావు, వీఏఎలు హేమంత్, త్రివేణి, అఖిల పాల్గొన్నారు.

కొమ్మూరు(కాకుమాను): రబీ సీజన్‌లో శనగ పంట సాగు చేస్తున్న రైతులు పంటపై పూత పురుగు ఆశించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ కె.కిరణ్మయి అన్నారు. మండలంలోని కొమ్మూరు, గార్లపాడు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం శనగ పంట పూత, పిందె దశలో ఉన్నందున పంటపై పురుగు ఆశించే అవకాశాలు అధికంగా ఉంటాయని ఆమె తెలిపారు. రబీ సీజన్‌లో సాగు చేస్తున్న రైతులు పంటల వివరాలను ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసి చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సుల్తాన, గోపినాథ్ యాదవ్ ఉన్నారు.

కూలి పనులకు వెళ్లి వ్యక్తి మృతి

కాకుమాను: కూలి పనులకు వెళ్లి ఎండ తీవ్రత తట్టుకోలేక వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అప్పాపురంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఏక్‌నాథ్ తెలిపిన వివరాలు.. మండలంలోని అప్పాపురం గ్రామానికి చెందిన దారా వెంకటస్వామి అలియాస్ జేమ్స్(48) రోజు మాదిరిగానే మంగళవారం కూలి పనులకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి పనికి వెళ్లినట్లు ఆయన తెలిపారు. రాత్రి సమయమైన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పంట పొలాల్లో వెతగ్గా పొలం గట్టుపై మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి కుమారుడు టింకూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలల భవిష్యత్‌కు పునాది అంగన్‌వాడీ కేంద్రాలు

ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాతదేవి



ప్రత్తిపాడు: బాల్యం ఆరంభానికి ముందు అలవాటు చేసే అభ్యసన పద్ధతులు, చిన్నారులకు అందించే పోషకాహారమే వారి భవిష్యత్తుకు సోపానం అవుతుందని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వి.సుజాతదేవి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని రామానగర్ కాలనీ అంగన్‌వాడీ సెంటరులో ఈసీసీఈ డేను పురస్కరించుకుని బుధవారం తల్లులకు పిల్లల ఎత్తు, బరువులపై అవగాహన కల్పించారు. అడిషనల్ సీడీపీవో విజయనిర్మల మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే అనుబంధ పోషకారం పిల్లలకు తినిపించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త టి.జ్యోతిరాణి, హెల్పర్ కరిమూన్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

అడిషనల్ ఎస్పీ హనుమంతు


పెదకాకానిలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ హనుమంతు, ప్రొఫెసర్ శ్యాంమోహన్ దేవిడ్


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పెదకాకాని: ప్రతి విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనపరచాలనే మంచి ఆశయంతో ఉచిత ట్యూషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ ఎ.హనుమంతు అన్నారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్, పెదకాకాని లూథర్‌గిరి కాలనీకి చెందిన డాక్టర్ శ్యాంమోహన్ డేవిడ్‌రాజ్, పూలే అంబేద్కర్ మిషన్ ప్రోగ్రాం పేరుతో పెదకాకాని లూథర్‌గిరిలో విద్యార్థులకు బుధవారం నుంచి ఉచితంగా ట్యూషన్ ప్రారంభించారు. ఈ ట్యూషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ హనుమంతు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదుతున్న విద్యార్థులు ఉన్నతశ్రేణిలో రాణించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన ఉచిత ట్యూషన్ సెంటర్ ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకూ చదువుకుంటున్న విద్యార్థులకు ఈ ట్యూషన్ ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. సమాజంలో క్రమశిక్షణతో కూడిన ఉత్తమ విద్యనభ్యసించి ప్రయోజకులు కావడం గొప్ప ఆస్తితో సమానమన్నారు. తొలుత జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉచిత ట్యూషన్ సెంటర్‌ను ప్రారంభించారు. నిర్వాహకులు డాక్టర్ శ్యాంమోహన్‌డేవిడ్ రాజు మాట్లాడుతూ అన్ని వసతులతో పిల్లలకు ఉచితంగా ట్యూషన్ ఏర్పాటు చేయడంతో పాటు పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఈ.ప్రకాష్, శౌలురాజు, కేంద్రీయ విద్యాలయ స్కూల్ టీచర్ రవీంద్ర పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధికి సాంకేతిక శిక్షణ అవసరం

ఎన్ఐటీటీఈఆర్‌తో ఒప్పందం


శిక్షణ సంస్థ ప్రతినిధులతో ఒప్పందం చేసుకుంటున్న వీవీఐటీ డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్

పెదకాకాని: జాతీయ సాంకేతిక అధ్యాపకుల శిక్షణ మరియు పరిశోధన సంస్థ(నేషనల్ ఇనిస్టూట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్, చెన్నై) మరియు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. ఈ ఒప్పదం ద్వారా అధ్యాపకులు, విద్యార్థులలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, సాంకేతిక విద్యా, పరిశోధనా నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించేలా అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. మండలంలోని నంబూరు వీవీఐటీలో బుధవారం కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ ఎన్ఐటీటీఈఆర్ చెన్నైలో ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఉషా నటేషన్, వీవీఐటీ డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్ మధ్య ఈ ఒప్పంద మార్పిడి జరిగిందన్నారు. ఈ ఒప్పందం ద్వారా ఉమ్మడి పరిశోధనా ప్రాజెక్టులు, సాంకేతిక విద్యా నాణ్యత పెంపు, ఫ్యాకల్టీ ఎక్సేంజ్ వంటి అంశాలలో సహకారం అందుతుందని వివరించారు. పాఠ్యాంశ అభివృద్ధి, ప్రశ్నాపత్రం సెట్టింగ్, నిరంతర మూల్యాంకన పద్ధతులు, విద్యా ఆడిట్, అక్రిడిటేషన్ రంగాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. రెండు సంస్థలు కలిసి దేశవ్యాప్తంగా ఉన్న సాంకేతిక అధ్యాపకులకు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక అంశాలపై శిక్షణ, వర్క్ ఆఫ్ సెమినార్, సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్లు విద్యార్థులను సన్నద్ధం చేయడం పరిశ్రమల సమస్యలకు సమర్థంగా పరిష్కారాలను సూచించడం ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశమని వివరించారు.

రేపటి నుంచి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: గోరంట్ల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాలను శుక్రవారం నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కంచర్ల ఆంజనేయులు తెలిపారు. బుధవారం అమరావతిరోడ్డులోని గోరంట్లలోని ఆలయంలో ఏర్పాటు చేసిన బ్రహ్మోత్సవాల గోడప్రతులను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, అంకురారోహణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 8వ తేదీన శనివారం ధ్వజారోహణ, గజవాహన సేవ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 9న ఉదయం ప్రత్యేక పూజలతోపాటు శ్రీనివాస కళ్యాణం కనుల పండువగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 10న ప్రత్యేక పూజలతోపాటు పూర్ణాహుతి, కుంభాభిషేకం, ధ్వజారోహణ, గరుడ ప్రసాదం, ద్వాదశప్రదక్షిణలు జరుగుతాయన్నారు. కళ్యాణంలో పాల్గొనే భక్త దంపతులకు పసుపు, కుంకుమ, పట్టుచీర, స్వామివారి శేషవస్త్రం, తిరుమల తిరుపతి స్వామివారి లడ్డుప్రసాదం, స్వామివారి అన్నప్రసాదం అందజేయటం జరుగుతుందని పేర్కొన్నారు. కళ్యాణంలో పాల్గొనే భక్తులు ముందుగా రూ.2,000 ఆలయ ఆఫీసులో చెల్లించి రసీదును పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గజవల్లి శివన్నారాయణ, కోశాధికారి దేవరశెట్టి సురేష్, ఉపాధ్యక్షుడు ఆళ్ళ శివారెడ్డి, సభ్యులు జవాది వెంకటసుబ్బారావు, పూసల శివశంకరరావు, గుంటూరు శ్రీహరిరావు, జల్లేపల్లి మునలయ్య, సూరె శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, రమేష్, కందుకూరు వెంకటరెడ్డి, కంచర్ల అమర్, కుర్నాల హరి వెంకటసతీష్, యర్రంశెట్టి సురేష్, వేముల సుబ్బారావు, సాయి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌ను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్


పెదకాకానిలో ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ట్రైనీ ఎస్పీ దీక్షిత

పెదకాకాని: ట్రైనీ ఐపీఎస్ అధికారి దీక్షిత పెదకాకాని పోలీసుస్టేషన్‌ను బుధవారం సందర్శించారు. ఫిర్యాదుల స్వీకరణ టేబుల్ వద్ద కూర్చుని పలువురు ఫిర్యాదు దారులతో మాట్లాడారు. పోలీసుస్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాల పనితీరు, వాటి సామర్థ్యాలను పెదకాకాని సీఐ కేపీ నారాయస్వామి ఆమెకు వివరించారు. పోలీసుస్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పోలీసుస్టేషన్ పరిధి, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, స్టేషన్‌లో నెలనెలా నమోదు అవుతున్న కేసులు సంఖ్య, ఎక్కువగా నమోదు అవుతున్న కేసులు వంటి అంశాలపై క్షుణ్ణంగా వివరాలు సేకరించారు. స్టేషన్ ప్రాంగణమంతా పరిశీలించిన దీక్షితకు నేరాలు జరిగినపుడు కేసుల్లో పట్టుబడిన ప్రాపర్టీ భద్రపరచే విధానం, స్టేషన్ సిబ్బంది విధులను వంటి అంశాలపై సీఐ వివరించారు.

విద్యార్థులకు వెంటనే కుల ధ్రువీకరణ పత్రాలు

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: విద్యార్థులు సరైన పత్రాలు జత చేసి కుల ధ్రువీకరణకు దరఖాస్తు చేసుకుంటే త్వరితగతిన విచారించి వెంటనే కుల ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేయడం జరుగుతుందని ప్రత్తిపాడు తహసీల్దార్ జి.కరుణకుమార్ తెలిపారు. విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నారంటూ బుధవారం 'సాక్షి'లో 'విద్యార్థులకు వ్యాకులం' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తహశీల్దార్ జి.కరుణకుమార్ కథనంపై స్పందించి విచారణ జరిపారు. యనమదల వీఆర్వో నుంచి వివరణ తీసుకున్నారు. విచారణలో భాగంగా బెజ్జం రోజాప్రకాష్‌ను వారి పిల్లల టీసీలు అడగడమైందని, అర్జీదారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందన లేకపోవడంతో సరైన ఆధారాలు లేక అర్జీని తిరస్కరించినట్లు చెప్పారు. విద్యార్థులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన ఎస్ఎల్‌ఏ ప్రకారం అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నామని తహసీల్దార్ స్పష్టం చేశారు.